సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



మాటమీద నిలబడే వ్యక్తి జగన్
మాట మీద నిలబడే వ్యక్తి సీఎం జగన్ అని, అందుకే తాము వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు పలువురు తెలిపారు. - 8లో



జాతర్లకు అనుమతి తప్పనిసరి
జిల్లాలో జరిగే జాతర్లకు సంబంధించి అనుమతి తప్పనిసరి అని జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. - 8లో



జెడ్పీ చైర్మన్ ఇంటి పెరట్లో 'ఆపిల్'
చల్లదనం ఉండే ప్రాంతాల్లో పండే ఆపిల్ వి.కోట మండలం పి.కొత్తూరు గ్రామంలోని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పెరట్లో దర్శనమిచ్చింది. - 8లో

న్యూస్‌రీల్

రెండు రోజుల పాటు ఈవీఎంల ర్యాండమైజేషన్

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల కసరత్తులో కీలకమైన ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను రెండు రోజుల పాటు పకడ్బందీగా చేపట్టనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎన్నికలకు అవసరమైన ఈవీఎంలను కలెక్టరేట్‌లోని రెండు గోడౌన్లలో పటిష్ట బందోబస్తు నడుమ భద్రపరిచారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియకు అవసరమైన సిబ్బందిని అధికారులు నియమించారు. పకడ్బందీ బందోబస్తు నడుమ రెండు రోజుల పాటు మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి ఈవీఎం యంత్రాలను ఏడు నియోజకవర్గాలకు కేటాయించనున్నారు. ఆ తర్వాత వాటిని అలాగే కలెక్టరేట్‌లోని గోడౌన్లలో భద్రపరచడం జరుగుతుందని కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు.

నేడు ఇంటర్ ఫలితాలు

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలను ఈ నెల 12న రాష్ట్ర ఇంటర్మీడియట్ అధికాలు విడుదల చేయనున్నారని జిల్లా ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల ఫలితాలు విడుదల అవుతాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాల్లో మార్చి 1వ తేదీ నుంచి 7 వరకు పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ



టైలరింగ్ సర్టిఫికెట్లు అందుకున్న వారితో శక్తి అగత్యన్

నగరి : ఓంశక్తి ఆధ్యాత్మిక సేవా ఉద్యమం ద్వారా టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు శక్తి ఏఏ అగత్యన్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. గురువారం ఏకాంబరకుప్పం ఓంశక్తి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి మేల్‌మరువత్తూరు బంగారు అడిగళార్ మనవడు అగత్యన్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేయడంతో పాటు, చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మజ్జిగ, పుచ్చకాయలను పంపిణీ చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లతో పాటు పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేల్స్ పంపిణీ చేశారు. ఉద్యమ రాష్ట్ర కార్యదర్శి వీటీ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా ఉద్యమ సభ్యులు టీసీ కృష్ణయ్య, గోవిందస్వామి, పి.మణి, రాజేష్ నాయుడు, కమలాకర్, షణ్ముఖ రెడ్డి, మోహన్, వి.భాస్కర్, ఈశ్వర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆస్పత్రిలో జనసేన వాహనాలు



పుంగనూరు పశువుల ఆస్పత్రిలో పార్కింగ్ చేసిన జనసేన పార్టీ నేతల వాహనాలు

పుంగనూరు: ఉమ్మడి అభ్యర్థుల ప్రచారంలో భాగంగా పుంగనూరు జనసేన నేతలు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. గురువారం పట్టణంలోని ఎంబీటీ రోడ్డులో గల పశువుల ఆస్పత్రిలో వాహనాలను పార్కింగ్ చేయడం విమర్శలకు దారితీస్తోంది. దీనిపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

టీడీపీ బ్యానర్లు తొలగించారు



బ్యానర్లను తొలగించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు కలెక్టరేట్ : ఈ నెల 10వ తేదీన సాక్షిలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా టీడీపీ నేతలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని వార్త ప్రచురితమైంది. నగరంలోని పుత్తూరుకు వెళ్లేదారిలో రూరల్ ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారి పక్కనే టీడీపీ నాయకులు బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఇదే విషయంపై వార్త ప్రచురించడం జరిగింది. దీనికి స్పందించిన ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అధికారులు గురువారం టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగించారు.

• వేడుకగా ఈద్ ఉల్ ఫితర్..!



పుంగనూరు మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

జిల్లా వ్యాప్తంగా గురువారం పవిత్ర రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఆనందోత్సాహాలతో జరుపున్నారు. ఈద్గా, మసీదులకు పెద్దఎత్తున చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. వీరి రాకతో మసీదులు, ఈద్గాలు జనసంద్రంగా కనిపించాయి. అల్లాను భక్తిశ్రద్ధలతో కొలిచారు. - చిత్తూరురూరల్

• బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, జెడ్పీ చైర్మన్, పలమనేరు ఎమ్మెల్యే

బడుగు, బలహీన వర్గాల్లో చైతన్యం నింపి వారి అభ్యున్నతికి పాటు పడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణిలో గురువారం ఆయన పూలే 198వ జయంతి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి పాల్గొన్నారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. - పలమనేరు/పెద్దపంజాణి

కూటమిలో నిప్పుల కుంపటి

ఎండాకాలంలో భానుడు కక్కుతున్న సెగ కంటే టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలోకి కూటమి రెండింతలు నిప్పుల కుంపటిని తలపిస్తోంది. విభిన్నమైన భావ సారూప్యం కలిగిన మూడు పార్టీలు కూటమిగా ఏర్పడ్డాయి. అయితే తొలి నుంచి ఆయా పార్టీల నేతలది ఎడ్డెం అంటే తెడ్డం అనే పరిస్థితి. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ కూటమిలో మరింత వేడి రాజుకుంటోందనే చెప్పాలి. కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకునేలా వారి వ్యవహారశైలి ఉంది. పొత్తు పొసగడం లేదు. అందులోనూ టీడీపీ అభ్యర్థుల ఏకపక్ష నిర్ణయాలతో కూటమిలో నిప్పుల కుంపటి రగులుతోంది.

• చిత్తూరు జిల్లాలో నామమాత్రంగానే కూటమి పార్టీలు • ప్రచారంలో పొసగని పొత్తులు • మిత్రపక్షాల్లో కనిపించని సయోధ్య
• ముస్లింల ఇళ్లకు వెళ్లినప్పుడు కాషాయ కండువాలు తీసేయాలని సూచనలు • జనసేన, బీజేపీలను నమ్మని పచ్చపార్టీ నేతలు
• టీడీపీ, జనసేన, బీజేపీలో ఎవరి రూటు వారిదే • ప్రచారంలో ఫ్యాన్ ప్రభంజనం

సాక్షి, చిత్తూరు: చిత్తూరు నియోజకవర్గంలో కూటమి పరిస్థితి మూడుముక్కలాట లాగా కనిపిస్తోంది. టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ నాయుడు నియోజకవర్గంలో అన్నీ తానై నడిపించేందుకు ఆరాటపడుతున్నారు. మిగిలిన బీజేపీ, జనసేనలకు ఏమాత్రం అవకాశం ఇవ్వడం లేదు. పైగా సొంత పార్టీ నేతలను దగ్గర చేర్చుకోవడం లేదనే వాదన వినిపిస్తోంది. పార్టీ కార్యక్రమాలన్నీ తన సొంత అనుచరులతోనే చక్కబెట్టేస్తున్నారు. పార్టీలో ఏళ్ల తరబడి సేవలందించిన సీనియర్లకు ఏమాత్రం ప్రాధాన్యత లేకుండా పావులు కదిపారు. ఆ దిశగానే నిర్ణయాలు తీసుకుంటూ అమలు చేస్తున్నారు. ప్రచారం నుంచి భవిష్యత్ ప్రణాళికలన్నీ కూడా ఏకపక్షంగానే సాగుతున్నాయి. దీన్ని జీర్ణించుకోలేని సీనియర్ నేతలు పైకి పార్టీ కార్యక్రమాల్లో కనిపిస్తున్నా వారి సహకారం ఏమాత్రం లేదనే ఆపార్టీలో చర్చ సాగుతోంది. దీనిపై ఇప్పటికే అధినేత చంద్రబాబుకు ఫిర్యాదులు కూడా వెళ్లినట్టు సమాచారం. మరోవైపు ప్రచార కార్యక్రమాల్లో బీజేపీ నేతలు, జనసేన నేతలు పాల్గొంటున్నప్పటికీ అంతగా భాగస్వామ్యం కావడం లేదనే వాదన ఉంది. పైగా టీడీపీ నుంచి టికెట్టు ఆశించిన డీకే శ్రీనివాసులు, జనసేన నుంచి టికెట్టు ఆశించిన డీకే కుటుంబానికి చెందిన చైతన్య కూడా కూటమి ప్రచారంలో కనిపించకుండా పోయారు.



నత్తనడకన కూటమి ఎంపీ అభ్యర్థి ప్రచారం..
కూటమి తరఫున చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల ప్రసాదరావును ఇప్పటికే టీడీపీ ప్రకటించింది. ఐఆర్ఎస్ అధికారి అయిన రాజకీయాలకు కొత్త. ఈ కారణంగా జిల్లాలోని టీడీపీ, బీజేపీ, జనసేన నేతలకు ఆయన పరిచయం అంతంతమాత్రమే. కూటమి అభ్యర్థి ఎవరు? అన్న సందేహం ఇప్పటికీ ఆయా పార్టీల్లో నెలకొని ఉండడం గమనార్హం. అభ్యర్థిగా ఖరారు చేసిన తర్వాత కూడా ఆయన ప్రచారం మందకొడిగా సాగుతోంది. పైగా ఎంపీ పరిధిలోకి వచ్చే ఏడు నియోజకవర్గాల్లోనూ ఆయన పర్యటించాల్సి ఉంది. దీనిపై సొంత పార్టీ నేతలే గుసగుసలాడుతుండడం గమనార్హం.

■ పూతలపట్టు టీడీపీ అభ్యర్థి డాక్టర్ మురళీ మోహన్‌కు ఆ పార్టీ నేతలు సహకరించడం లేదనే ప్రచారం సాగుతోంది. ప్రచారంలో చిన్నపాటి కార్యకర్తలు మినహా చెప్పుకోదగిన నాయకులు పాల్గొనడం లేదు. ఇంత కాలం పార్టీ జెండాలు మోసిన తమను కాదని పెత్తనమంతా బయటివారికి కట్టబెట్టడాన్ని స్థానిక స్థాయి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికే పార్టీ అధినేతలు, మాజీమంత్రి వద్ద కూడా అనేకమార్లు పంచాయతీలు కూడా నడిచాయి. పైగా బీజేపీ, జనసేన నేతల సహకారం కూడా అంతంతమాత్రంగానే ఉంది. ఇప్పటివరకు కూటమి ప్రచారం ప్రారంభం కాలేదు. ఎవరికి వారుగా ప్రచారం సాగిస్తుండడంతో విభేదాలు రోజురోజుకు పెరుగుతున్నాయి.

■ పుంగనూరు నియోజకవర్గంలో కూటమి పార్టీల్లో కలిసే ప్రచారం చేస్తున్నాయి. పైకి సఖ్యతగా కనిపిస్తున్నా అందులో ఎక్కడా సఖ్యత ధీమా కనిపించలేదు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఓడించాలని ఒకవైపు కూటమి పార్టీలు, మరోవైపు బీసీవై పార్టీ పథక రచనలు చేస్తున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. రాజంపేట ఎంపీ అభ్యర్థిగా మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేస్తున్నప్పటికీ స్థానికంగా ఆయన ప్రభావం అంతగా కనిపించడం లేదు. స్థానికంగా టీడీపీలోని అంతర్గత పోరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డికి తలనొప్పిగా మారింది. మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, టీడీపీ నేతలు అనీషా రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి పార్టీ అభ్యర్థి కోసం పనిచేయడం లేదనే ప్రచారం సాగుతోంది.

■ నగరిలో కూటమి ప్రచారంలో టీడీపీ నేతలే ఎక్కువ కనిపిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే జనసేన, బీజేపీ నేతలను కలుపుకుంటున్నారు. అది కూడా జనసేన నేతలు ఒకరిద్దరు మాత్రమే కండువా వేసుకుని తిరుగుతున్నారు. ఇటీవల టీడీపీ, బీజేపీ నేతలు పార్టీ కండువాలతో ముస్లింలు నివసించే ప్రాంతాల్లో ప్రచారానికి వెళ్లారు. ఆ సమయంలో బీజేపీ కండువాలు తీసేయాలని స్వయంగా టీడీపీ నేతలు కమలం నేతలకు చెప్పడంతో కొత్త విభేదాలకు దారి తీసింది. మళ్లీ టీడీపీ నేతలు మేలుకుని బీజేపీ నేతల ఇళ్లకు వెళ్లి బుజ్జగించి తీసుకురావాల్సి వచ్చింది. బీజేపీ నేతల్లో కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు మాత్రమే టీడీపీతో ఎక్కువగా జతకడుతుండడం గమనార్హం. టీడీపీ నుంచి ఇటీవల బీజేపీలో వెళ్లిన అశోక్‌రాజు కూటమి ఆదేశాలను ఏమాత్రం లెక్క చేయడం లేదు. పైగా టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్‌కు వ్యతిరేకంగానే పని చేస్తున్నారని టీడీపీ ఆరోపిస్తోంది.

■ పలమనేరులో మాజీమంత్రి అమరనాథ్‌రెడ్డి అందరినీ కలుపుకునే ప్రచారం సాగిస్తున్నారు. కానీ, కూటమి పార్టీ నేతల తెరవెనుక రాజకీయాలు ఆయనకు కొత్త ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. అందుకే నేతల్ని నమ్మకుండా పార్టీ కేడర్‌తోనే ఆయన సరిపెట్టుకునే ప్రచారం సాగిస్తున్నారు. ఇక తాము సంపూర్ణంగా సహకరిస్తున్నప్పటికీ ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదని బీజేపీ, జనసేన కేడర్ అమరనాథ్‌రెడ్డి మండిపడుతోంది.

జిల్లాలో ఫ్యాన్ ప్రభంజనం..



చిత్తూరు జిల్లాలోని ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అవసరాన్ని బట్టి ఆయా నియోజకవర్గాల్లో పర్యటిస్తూ సమన్వయం చేశారు. ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థులంతా ఇప్పటికే రెండు, మూడుసార్లు తమ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలను ప్రచారం పూర్తి చేసేశారు.

■ జీడీనెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి థామస్ ఇంతకాలం పార్టీ జెండాలు మోసిన వారిని పక్కన పెట్టేశారని ప్రచారం సాగుతోంది. అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి ఉందని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. ఇంతకాలం పార్టీకి సేవ చేసిన తమకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా ఒంటెద్దు పోకడలు అవలంభిస్తున్నారని ఆ పార్టీ నేతలు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

■ కుప్పం నియోజకవర్గంలో కూటమిలో పొత్తులు పొసగడం లేదు. టీడీపీ ఆధిపత్య ధోరణి కారణంగా కూటమిలోని బీజేపీ, జనసేన నేతలు దూరం పాటిస్తున్నారు. కమ్మ సామాజికవర్గం ఆధిపత్యం కారణంగా మిగిలిన పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎంత పనిచేసినా తమకు అడుగడుగునా అవమానాలే ఎదురవుతున్నాయని లోలోన రగిలిపోతున్నారు. బీసీ జనాభా ఎక్కువగా ఉన్న కుప్పంలో టీడీపీ కమ్మ సామాజికవర్గం నేతలపై మండిపడుతున్నారు. ఇటు బీజేపీ అటు జనసేన పార్టీలు అంటీముట్టనట్లు ఉంటున్నారు. జనసేన నియోజకవర్గ నాయకులు మాత్రంపైకి టీడీపీతో కలసినట్టుగా కనిపిస్తున్నా ఎన్నికల్లో సహకరించే పరిస్థితులు లేవని స్వయంగా టీడీపీ నేతలే చెబుతున్నారు.

నైతిక విలువల్లేని పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ

• చంద్రబాబు బూటకపు హామీలను ప్రజలు నమ్మరు
• డిప్యూటీ సీఎం నారాయణస్వామి



ఎన్నికల ప్రచారంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జ్ఞానేంద్రరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

పెనుమూరు(కార్వేటినగరం): నైతిక విలువల్లేని పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీలతో పాటు కాంగ్రెస్ అని, ఈ పార్టీ లు కూటమిగా కలసి వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేస్తే వెన్నుపోటు దారుడు చంద్రబాబుకు ఓటు వేసినట్లేనని మంత్రి ఎద్దేవాచేశారు. ఆచూకీ లేని పొత్తుల పార్టీతో పాటు కాంగ్రెస్ పార్టీ పోటీ చేయడం కంటే టీడీపీలో విలీనమవడమే మేలని మంత్రి చురకలంటించారు. అధికారంలోకి వస్తే పెన్షన్‌తో పాటు వలంటీర్ల జీతాలను పెంచుతామని చంద్రబాబు చెబుతున్న మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. చంద్రబాబు ఆచరణకు సాధ్యం కాని హామీలిస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తున్నారని తెలిపారు. సొంతంగా పోటీ చేయలేని పార్టీలకు ఎందుకు పార్టీలు, పార్టీ గుర్తులు ఎందుకని విమర్శలు గుప్పించారు. పొత్తులో భాగంగా 23 సీట్లు తీసుకున్న పవన్‌కల్యాణ్ కనీసం ఆ 23 సీట్లయినా మీ అభ్యర్థులను నిలబెట్టే దమ్ము మీకుందా ? అని పవన్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందించిన పాలనను జీర్ణించుకోలేక అన్ని పార్టీలు తోడేళ్ల గుంపు ఒక్కటయ్యాయన్నారు. ప్రజలకు మేలు చేయని పార్టీలు కూడా చంద్రబాబుతో జత కట్టడం నీచరాజకీయాలకు నిదర్శనమన్నారు. దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా ? అన్న చంద్రబాబుకు దళితులను ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, ఆదినారాయణరెడ్డి దళితులను ఏవిధంగా కించపరచి మాట్లాడారో దళిత సోదరులంతా గమనించాలన్నారు. ఎన్నికల సమయంలోనే చంద్రబాబుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు గుర్తుకు వస్తారన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు రావాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట రాష్ట్ర విదేశీ వ్యవహారాల సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు మహాసముద్రం దయాసాగర్‌రెడ్డి నాయకులు ఉన్నారు.

బాలికా విద్యకు పూలే కృషి

• జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మజ్యోతిరావు పూలే అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. గురువారం పూలే 198వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ సర్కిల్ వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికలకు చదువు ఎంతో ముఖ్యమని గుర్తించిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు పూలే అని అన్నారు. 21 ఏళ్ల వయసులో అట్టడుగు వర్గాల బాలికల చదువు కోసం మొదటి సారిగా ఆయన 1848లో పాఠశాలను ప్రారంభించారన్నారు. చదువుతోనే మహిళలు ఆర్థికంగా, అన్ని రంగాల్లో రాణించగలరని చెప్పారు. దేశం ప్రగతి పథంలో పయనించాలంటే విద్య ఎంతో అవసరమని, తన కోసం జీవించడం కంటే సమాజం, దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మేధావి జ్యోతిరావు పూలే అని అన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువత ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, బీసీ కార్పొరేషన్, ఈడీ శ్రీదేవి, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు తిరుపతిలో వలంటీర్ చిత్రం టైటిల్ లాంచ్



టైటిల్ లాంచ్ ఆహ్వాన పత్రిక

పలమనేరు: తిరుపతిలోని బ్లిస్ హోటల్‌లో శుక్రవారం వలంటీర్ చిత్ర టైటిల్ లాంచ్ కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్‌సీపీ నాయకులు, సినీ నిర్మాత రాకేష్‌రెడ్డి గురువారం పలమనేరులో తెలిపారు. రాష్ట్రంలో కోవిడ్ విపత్కర సమయంలో వలంటీర్లు చేసిన సేవలను తలపిస్తూ ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, శ్రీబ్రహ్మాపాదం కృష్ణమాచార్యులు పాల్గొంటారని తెలిపారు.

చూపుడు వేలు లేకపోతే ఎలా ?



చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. పోలింగ్ కేంద్రంలో ఓటరు గుర్తింపు నిర్ధారణ అయిన తరువాత ఎలాంటి సందేహాలు లేకపోతే సదరు వ్యక్తి ఎడమ చేయి చూపుడు వేలిపై సిరాతో మార్కు పెడతారు. ఓటు వేసిన వ్యక్తి ఎడమ చేతికి చూపుడు వేలు లేకపోతే ఎలా అనే సందేహం వస్తుంది. ఇందుకు ఎన్నికల సంఘం ఒక నిర్దిష్టమైన విధానాన్ని రూపొందించింది. ఎడమ చేయి చూపుడు వేలు లేకపోతే మధ్యవేలుకు, అది కూడా లేకపోతే ఉంగరం వేలు, చిటికిన వేలు, బొటనవేలుకు సిరా చుక్క పెడతారు. ఒకవేళ ఎడమ చేయికి పూర్తిగా వేళ్లు లేకపోతే కుడి చేయి చూపుడు వేలు, అదీ లేకపోతే ఇతర వేళ్లకు సిరాగుర్తును పెడతారు. రెండు చేతులకు వేళ్లు లేకపోతే వేళ్ల మధ్య భాగంలో, ఎడమ చేయి పక్క భాగంలో ఇంకు గుర్తు స్పష్టంగా కనిపించేలా సిరా చుక్కను వేస్తారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైకు



ప్రమాదానికి గురైన బైకు

గంగాధర నెల్లూరు: మండలంలోని సుందరరాజపురం వద్ద లారీ ట్యాంకర్‌ను ఓ యువకుడు బైక్‌పై వెళ్తూ ఢీకొట్టి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గంగాధరనెల్లూరు సీఐ శంకర్ కథనం మేరకు.. చిత్తూరు మండలం బంగారెడ్డిపల్లికి చెందిన దండుపాని కుమారుడు ఆర్య(16) అనే యువకుడు గురువారం ఉదయం సుమారు 5.45 గంటల ప్రాంతంలో ఎలక్ట్రిక్ బైక్‌పై చిత్తూరు నగరానికి వెళ్తుండగా అప్పటికే మంచు కారణంగా ఎదురుగా ఉండే వాహనం తెలియక రోడ్డు ఆగి ఉన్న పాల ట్యాంకర్ లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆర్యకు తీవ్ర రక్తస్రావం జరగడంతో వెంటనే చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడే డాక్టర్ పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారని తెలిపారు. ఆ యువకుడు మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎంసీసీ ఉల్లంఘనలపై విచారణ

చిత్తూరు కలెక్టరేట్ : మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలపై సమగ్ర విచారణ చేసి నివేదికలు ఇస్తున్నట్లు జిల్లా ఎంసీసీ నోడల్ అధికారి మురళీకృష్ణ వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో వివిధ సామాజిక మాధ్యమాలు, వార్తాపత్రికల్లో వచ్చిన 8 ఎంసీసీ ఉల్లంఘనలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని ఆయా ఆర్‌ఓల నుంచి నివేదికలు తెప్పించుకుని, వాటిని జిల్లా ఎన్నికల అధికారికి పంపించామన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న వాటిపై చర్యలు తీసుకున్నామని చెప్పారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు అమలు చేసేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

గంగజాతరకు అనుమతి తప్పనిసరి

– జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గంగజాతర్లకు, ఊరేగింపులకు, ఇతర ఉత్సవాలకు ముందస్తుగా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. ముందస్తుగా ఎన్నికల అధికారి నుంచి అనుమతులు పొందాలన్నారు. అనుమతి లేకుండా నిర్వాహక కమిటీలు ఎటువంటి చాటింపులు కానీ, ప్రచారాలు కానీ చేయకూడదన్నారు. జిల్లాలో ఎక్కడైనా అలా చేస్తే ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకమవుతుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి హెచ్చరించారు.

సీఎం జగన్.. మాటపై నిలబడే నేత

- అందుకే మనస్ఫూర్తిగా చేరుతున్నాం
- సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉంటాం
- నగరి, పలమనేరు, కుప్పంలో వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు
- కండువాలు వేసి ఆహ్వానించిన మంత్రి రోజా, ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్



విజయపురం మండలం మహారాజపురంలో పార్టీలో చేరిన నేతలతో మంత్రి ఆర్కే రోజా

విజయపురం : ''గత ఎన్నికల్లో ఇచ్చిన మాటపై నిలబడ్డారు.. ఇచ్చిన హామీలు నెరవేర్చారు.. అందుకే మాట తప్పే పార్టీలో ఉండదలచుకోలేదు.. సీఎం జగన్ మాటపై నిలబడే నేత.. అందుకే వచ్చే ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వానికి అండగా ఉందామని పార్టీలోకి వస్తున్నాం..'' అంటూ విజయపురం మండలం మహారాజపురం, పాతర్కాడు పంచాయతీ గొల్లపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్, టీడీపీ నాయకులు అన్నారు. గురువారం వారు మంత్రి ఆర్కే రోజా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా క్షూరికాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చంద్రయ్య ఆధ్వర్యంలో మహావీరపురం గ్రామానికి చెందిన బాబు, మణి, దాము, లక్ష్మయ్య, మునస్వామి వీరితో పాటు ఇరవై కుటుంబాలకు చెందిన వారు మంత్రి రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకుడు జయప్రకాష్ ఆధ్వర్యంలో ఆయన అనుచరులు రాధాకృష్ణ, గోపి, కవిత, తరుణ్, పురుషోత్తం, శాంతిలక్ష్మి, శాంతిలక్ష్మి, చిట్టెమ్మ దేశమ్మ, పి. కృష్ణయ్య, ఎం.చంద్రయ్య వెంకటమందడి, రమ్య, రేవతి, తేజస్విని, పురుషోత్తం తదితరులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరగా మంత్రి రోజా వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ జంబాడ నుంచి కనకమ్మ సత్రానికి వెళ్లే దారి గురించి గతంలో ఎవరూ పట్టించుకోలేదని, మంత్రి ఆర్కేరోజా రూ.2 కోట్లు నిధులతో రోడ్డు వేయించారని తెలిపారు. నాడు–నేడు పథకంలో గ్రామంలోని పాఠశాల సుందరంగా మారిందన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌కు సొంత భవనం నిర్మించారన్నారు. పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చెప్పిన ప్రతి హామీని నెరవేరుస్తుందని ధైర్యంగా చెప్పగలుగుతున్నారని తెలిపారు. ఎందుకంటే సీఎం జగన్ ఇచ్చిన మాటపై నిలబడుతున్నారని నిరూపితమైందని, అందుకే మనస్ఫూర్తిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గోపి, ఎంపీపీ జమున వెంకటేష్, జెడ్పీటీసీ వెంకటేష్, వైస్ ఎంపీపీ బాలాజీ, శ్రీహరిపురం సర్పంచ్ రగేష్, జంబాడ సర్పంచ్ భాస్కర్, కోసలనగరం ఎంపీటీసీ కన్నెమ్మ, ఇళ్తూరు సర్పంచ్ గోపి, ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్ రెడ్డి, నాయకులు కృష్ణమ శెట్టి, దేవా, సతీష్, కుమార్,కుమార్, మోహన్ రాజు, బాబు, రాజగోపాల్ శివరాజ్ భాస్కర్ రెడ్డి ఆనంద్, శివరాజ్, వెంకటేశులు చంద్రయ్య, దాము, వెంకటరమణ, పాండియన్, కిరుబ, గుణశేఖర్ రెడ్డి, మునస్వామి హరి నాయుడు, రవి నాయుడు, శ్రీరాముడు రెడ్డి ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి..

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట, తుర్లపల్లి, చామనేరు గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ, జనసేన నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ గురువారం వారికీ వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషి చేయాలని, కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని వారికి సూచించారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపాలన, ఎమ్మెల్యే వెంకటేగౌడ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై తాము వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో రెడ్డెప్ప, దిలీప్, అనీల్, యోగానంద, వెంకటేష్, ఏకాంబరం, వెంకటాచలపతి, తుర్లపల్లి పంచాయతీ నుంచి జన్మభూమి కమిటీ సభ్యుడు సతీష్‌కుమార్, మాజీ సర్పంచ్ టి.వెంకటాచలపతి, హేమాద్రి, అమర, చామనేరు నుంచి జనసేన నేత లోకేష్ ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సుహేబ్, మూకయ్య, సర్పంచ్ మురళి, పార్టీ నాయకులు హేమచంద్ర, ఇమాంవళి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ చిన్నపేట కురప్పల్లికి చెందిన పలువురు టీడీపీ నాయకులు గురువారం స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. తాము టీడీపీ విధానాలు నచ్చకే వైఎస్సార్‌సీపీలో చేరామని పార్టీలో చేరిన టీడీపీ బూత్ కమిటీ మెంబర్ సుందర్‌రాజు, నటరాజ్, గోవిందరాజ్, నవీన్, రాజు, సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్ కుమార్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి, నాయకులు రాజేష్, దయానందగౌడ తదితరులు ఉన్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: మండలంలోని మణీంద్రం గ్రామానికి చెందిన టీడీపీ నేత కుమార్ తన కుటుంబంతో సహా గురువారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఈ సందర్భంగా కుమార్ కుటుంబ సభ్యులకు భరత్ పార్టీ కండువా కప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, నేతలు చంద్రమోహన్ రెడ్డి, బోర్‌వెల్ చెంగారెడ్డి, రఘు, శివ, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే వెంకటేగౌడ,



రామకుప్పం: వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేత కుటుంబంతో ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి

పార్టీ గెలుపునకు కృషి చేయండి



మాజీ ఎంపీపీ రాజేంద్రన్‌తో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పలమనేరు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కృషి చేయాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలమనేరు మాజీ ఎంపీపీ రాజేంద్రన్‌కు సూచించారు. ఈ మేరకు మంత్రి గురువారం స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడతో కలసి పట్టణంలోని రాజేంద్రన్ ఇంటికి వెళ్లి మాట్లాడారు. ఈ ఎన్నికలు వైఎస్సార్‌సీపీకి చాలా కీలకమని, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు మళ్లీ కొనసాగాలంటే తప్పకుండా వైఎస్సార్‌సీపీ పాలన రావాల్సిందేనన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రన్ మాట్లాడుతూ పట్టణంలో వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం శక్తివంచనల లేకుండా కృషి చేస్తామని మంత్రికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెద్దపంజాణి నాయకులు సుహేబ్ పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్ ఇంటి పెరట్లో 'ఆపిల్'

వి.కోట: ఎక్కడో అతిచలి ప్రాంతాల్లో పండే ఆపిల్ వి.కోట మండలంలోని పి.కొత్తూరు గ్రామం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పెరట్లో గురువారం దర్శనమిచ్చింది. ఆ ఆపిల్‌ని జెడ్పీ చైర్మన్ దంపతులు పట్టణంలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి సమర్పించి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఆ మొక్కను ఏడాది కిందట హిమాచల్‌ప్రదేశ్‌లోని బిలాసపూర్ జిల్లాలో నివసించే శ్రీ హరిమాన్ శర్మ దగ్గర కొన్నట్లు చెప్పారు. సాధారణంగా చలి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కాసే ఆపిల్ పండు 35–40 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న వి.కోట మండలంలో కాయడం ఆశ్చర్యంగా అనిపించిందన్నారు.

సీకే బాబుకు నోటీసులు జారీ

- ఎన్నికల నియమావళికి విరుద్ధంగా జాతర విషయంపై ప్రకటన చేసిన సీకే
- 24 గంటల్లోపు సంజాయిషీ ఇవ్వాలని ఆదేశాలు
- నోటీసు జారీచేసిన చిత్తూరు అసెంబ్లీ ఏఆర్‌ఓ చిన్నయ్య

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల నియమావళికి విరుద్ధంగా చిత్తూరు జాతర విషయంపై సామాజిక మాధ్యమాల్లో పత్రికా సమావేశం ఉంటుందని వెల్లడించిన మాజీ ఎమ్మెల్యే సీకే బాబుకు గురువారం రాత్రి చిత్తూరు అసెంబ్లీ అసిస్టెంట్ ఎన్నికల అధికారి చిన్నయ్య నోటీసులు జారీచేశారు. వివరాల మేరకు.. మే 14, 15 తేదీల్లో నిర్వహించే చిత్తూరు నడివీధి గంగమ్మ జాతర వేడుకలపై ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు నగరంలోని పొన్నియమ్మన్ దేవస్థానంలో విలేకరుల సమావేశం ఉంటుందని సీకే బాబు సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు మార్చి 16వ తేదీ నుంచి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. ఈ సమయంలో సమావేశాలకు జిల్లా ఎన్నికల అధికారి నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. అయితే ఇందుకు విరుద్ధంగా ఎలాంటి అనుమతి లేకుండా జాతర విషయంపై సమావేశం ఉంటుందని సామాజిక మాధ్యమాల్లో ప్రకటన ఇచ్చారని పేర్కొన్నారు. ఇందుకు గాను జాతర నిర్వాహకులు సీకే బాబుకు నోటీసు జారీచేయడం జరిగిందన్నారు. 24 గంటల్లోపు తప్పనిసరిగా సంజాయిషీ ఇవ్వాలని ఏఆర్‌ఓ ఆ నోటీసులో పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన కుమార్

పుంగనూరు: మండలంలోని రాంపల్లెకు చెందిన రామయ్య కుమారుడు కుమార్ (33) కడుపునొప్పి తాళలేక ఇంట్లో ఉరివేసుకుని గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కుమార్ క్వారీలో పని చేస్తుంటాడు. ఇలా ఉండగా గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న కుమార్ ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరి వేసుకుని మృతి చెందాడు. దీన్ని గమనించిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులతో కలిసి కాపాడే ప్రయత్నం చేసి, కుమార్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. శవాన్ని పోస్టుమార్టంకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

తవణంపల్లె: అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ పి.వి.సుధాకర్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పట్నం బైపాస్ రోడ్డులో తమ సిబ్బందితో కలసి వాహనాలను తనిఖీ చేస్తుండగా మండలంలోని నలిశెట్టిపల్లెకు చెందిన ఎం.రామయ్య మోటారు సైకిల్‌పై ఏపీకి చెందిన 58 మద్యంబాటిళ్లను తరలిస్తుండగా పట్టుబడినట్లు వివరించారు. వాహనాన్ని, 58 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉండగా అనుమతి లేకుండా అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భలే మంచి కండువా బేరం

జంపింగ్ జపాంగ్‌ల కారణంగా పార్టీ నాయకులకు తలనొప్పులు వస్తున్నాయి. ఈ రోజు పార్టీలో చేరిన వ్యక్తి పూట గడవక మునుపే సొంతగూటికి చేరుతుండడంతో కలవర పడుతున్నారు. అపోజిషన్ పార్టీ నేతలను ఇటువైపు లాక్కోవడానికి టీడీపీలోని కొందరు స్పెషలిస్టులు పన్నాగం పన్నుతారు. ఏదో కథ చెప్పి పార్టీ అధిష్టానం వద్ద కండువా వేయించి ఎంతో కొంత నగదు ముట్టజెప్పేలా చూస్తారు. ఆ నగదు అయిపోయేవరకు దాబాల్లో రాజకీయం స్టార్ట్ చేస్తారు. ఇంతవరకు బాగానే ఉన్న పార్టీ మారిన వ్యక్తి తనకు క్షవరం అయిందన్న విషయం తెలుసుకుని సొంతగూటికి చేరుకునే పనిలో పడుతున్నారు.



పలమనేరు: ఈరోజు ఓ పార్టీలో చేరుతున్నట్లు కండువా వేసుకోవడం, మరుసటిరోజు మరో పార్టీలో కండువా వేసుకోవడం పలమనేరు నియోజకవర్గంలో ఫ్యాషన్‌గా మారింది. గత కొన్నాళ్లుగా ఇలాంటి జంపింగ్ జిలానీలను చూస్తున్న జనం ఇదేం ఖర్మరా బాబు అనుకుంటున్నారు. మరోవైపు కండువాలను వేయించే స్పెషలిస్టులు సైతం ఇక్కడ పుట్టుకొచ్చారు. పార్టీ నేత వద్దకెళ్లడం తాము ఫలానా వాడిని పట్టేశామని అతను మన పార్టీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నాడని, అతనికి ఎక్కువగా ఓట్లున్నాయంటూ చెప్పడం వీరి తొలిపని. వీరిమాట నమ్మి ఆ నాయకుడు అతనికి నిర్ణయించిన నగదు, ఓ స్వీట్ బాక్సును కండువా స్పెషలిస్టులకు అందజేస్తాడు. దీంతో రంగంలోకి దిగిన స్పెషలిస్టులు జంపింగ్ జిలానీలను మునగచెట్టు ఎక్కించి పార్టీలో చేర్పిస్తూ కండువా వేయించి అతన్ని అభినందించి సోషల్ మీడియాలో వీడియో, ఫొటోలను వైరల్ చేస్తారు. అంతటితో వీరి పని అయిపోదు. కొత్తగా కండుగా కప్పుకున్న వ్యక్తికి ఆ పార్టీ నాయకుడు ఇచ్చిన డబ్బును డాబాల్లో విందులతో మొత్తం ఖాళీ చేయించే దాకా వదలరు ఈ స్పెషలిస్టులు. రాత్రంతా ఆలోచించి, ఆ పార్టీ ఫిరాయించిన వ్యక్తి ఉదయం లేచి తనకు బాగా కావాల్సిన వాళ్ల దగ్గర జరిగిన గోడును వెళ్లబోసుకుంటాడు. అంతే మరో బ్యాచ్ రంగంలోకి దిగి అతన్ని శాంతింపజేసి తిరిగిసొంత గూటికి చేర్చడం ఇక్కడ రివాజుగా మారింది.

వందమంది టార్గెట్..పచ్చబ్యాచ్ స్కెచ్

నియోజకవర్గంలో సామాజికవర్గాల వారీగా ఓట్లను బట్టి ఇతర పార్టీలు, తటస్తులతో వందమంది దాకా జాబితాను పచ్చ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. వీరికి ఉన్న ఓట్లను బట్టి అతని తలకు రేటు కట్టి దాంతో పైరవీలు జరగుతున్నట్టు ఇక్కడ జనంలో టాక్. ఆ లెక్కన చిన్నపాటి నేతకైతే రూ.10 వేల నుంచి రూ.50 వేల దాకా పలికే చేపలకే వీరు గాళం వేస్తున్నట్టు ఈ మధ్య జరిగిన కండువాల వ్యాపారం చూస్తుంటే అర్థమవుతోంది.

ఇంత చేసినా ఎగిరిపోతున్న చేపలు..

ఎన్నో మాటలు చెప్పి కండువాలు మార్చినా సంబంధిత వ్యక్తులు మళ్లీ సొంతగూటికి చేరుతున్నారు. దీన్ని చూసి పచ్చబ్యాచ్‌కు కడుపుమండుతోంది. ఏదేమైనా ఇలాంటి డబుల్‌గేమ్ ఆడుతున్న వారిని చూసి జనం నవ్వుకుంటున్నారు. ఎవరైనా పార్టీలో చేరే నేతకు ఎంతమేరకు ఓటర్లను ప్రభావితం చేస్తాడో లెక్కగట్టకుండా ఏదో కండువాలు వేయించామా అంటూ పార్టీని హైప్ చేసే ప్రయత్నాలు ఇక్కడ సర్వసాధారణంగా మారాయి. బుట్టలో నుంచి ఎగిరిపోతున్న వారికి ఉన్న ఓట్లు ఎగిరిపోవడం కొసమెరుపు.

సుబ్రమణ్యస్వామి సేవలో మంత్రులు



సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద మంత్రులు పెద్దిరెడ్డి, ఆర్‌కే రోజా

నగరి: తిరుత్తణి సుబ్రమణ్యస్వామిని పంగుణి కృత్తికను పురస్కరించుకుని రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఆలయానికి విచ్చేసిన వారు ఆలయ ప్రదక్షిణ చేసి సుబ్రమణ్యస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనల్లో పాల్గొని దర్శించుకున్నారు. అనంతరం పలు అంశాలపై వారు చర్చించుకున్నారు. తమది తండ్రీ, కూతుళ్ల బంధమని, తమ మధ్య ఆప్యాయతానురాగాలు ఎప్పటికీ తరగవన్నారు. ఆయన మిథునన్నపై ఎంత ఆప్యాయతను చూపుతారో తన పట్ల కూడా అంతే ఆప్యాయతను చూపుతారని మంత్రి ఆర్కేరోజా ఈ సందర్భంగా తెలిపారు. ఆయన ఆశీస్సులు తనకు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు.

గుడిపాలకు చేరిన ఏనుగుల గుంపు



గుడిపాల: పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

గుడిపాల: గుడిపాల మండలానికి గురువారం రాత్రి ఏనుగుల గుంపు చేరింది. చిత్తపార అటవీప్రాంతం నుంచి వెప్పాలమాను గ్రామ సమీపంలోని అటవీప్రాంతానికి ఏనుగులు చేరుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. రవిశంకర్ అనే రైతుకు చెందిన పాడి ఆవును గాయపరిచాయి. అలాగే కొంత దూరంలోని టమాట పంటను తొక్కి నాశనం చేశాయి. అక్కడే పొలానికి అడ్డుగా ఉన్న ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశాయి. ప్రస్తుతం పల్లూరు గ్రామం వైపు ఏనుగులు సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. రాత్రి 10 గంటల ప్రాంతంలో వరిపంటను ధ్వంసం చేస్తుండగా అక్కడి రైతులు టపాకాయలు పేల్చి ఏనుగుల గుంపును అటవీప్రాంతంలోకి తరిమారు. ఆపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.



ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు

"చంద్రబాబు.. అధిష్టానం.. డడడా"

ఎన్నికల ముందు హామీల వరద.. అధికారంలోకి వచ్చాక ఆ హామీలను మాఫీ చేయడంలో దిట్టగా పేరు గడించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తాజాగా ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను కుప్పం జనం కూడా పట్టించుకోవడం లేదు. ఇదే విషయాన్ని కుప్పం నియోజకవర్గ టీడీపీ బాధ్యతలు చూస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్వయంగా చెప్పారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో కంచర్ల మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ×మీటింగుల్లో ఎన్నిసార్లు చెప్పినా.. బాబు ష్యూరిటీ– భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం 88 శాతం పూర్తి చేసినాం.. ఇంకా కూడా మన పథకాలు జనం మైండ్‌లో రిజిస్టర్ కాలేదంటే లోపం ఎక్కడుంది? జనానికి పాంప్లెట్ ఇచ్చేసి ''చంద్రబాబు.. అధిష్టానం.. డడడా''అని నమస్కారం పెట్టి పరిగెత్తడం కాదు.. మొన్న శ్రీకాళహస్తిలో సార్ (చంద్రబాబు)ను కలిసినప్పుడు నాకు చెప్పింది ఇదే అని కంచర్ల శ్రీకాంత్ మాట్లాడిన వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ అవుతోంది. దీనిపై నెటిజన్లు స్పందిస్తున్నారు. రోజూ అబద్ధాలు చెప్పేవారిని జనం ఎక్కువ రోజులు నమ్మరని కామెంట్ చేస్తున్నారు. చంద్రబాబును, ఆయన మాటలను నమ్మేకాలం పోయిందని సూటిగా తమ అభిప్రాయాలు చెబుతున్నారు. ఇక కుప్పంలో బాబు కథ ముగిసిందని కొందరు స్పష్టం చేశారు.

– శాంతిపురం